## క్లుప్తంగా

### గురుకులంలో ప్రవేశానికి గడువు పొడిగింపు

**లింగసముద్రం:** మండలంలోని పెదపవనిలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 28 వరకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ కె.స్నేహలత ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ నెల 28 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

### రెండు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

**గుడ్లూరు:** ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మండలంలోని గుండ్లపాలెం అడ్డరోడ్డు వద్ద ఎస్సై లక్ష్మణరావు ఆదివారం తెల్లవారుజామున స్వాధీనం చేసుకున్నారు. గుండ్లపాలెంలో మన్నేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం అందుకున్న ఎస్సై లక్ష్మణరావు సిబ్బందితో గుండ్లపాలెం అడ్డరోడ్డు వద్ద కాపుకాసి ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్లను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్లపై కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తామని తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### 11 మద్యం సీసాలు స్వాధీనం

**గుడ్లూరు:** దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన 11 మద్యం సీసాలను ఎస్సై లక్ష్మణరావు శనివారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని సాలిపేట గ్రామంలో శ్రీహరి అనే యువకుడు చిల్లర దుకాణం నిర్వహిస్తూ అందులో మద్యం సీసాలను నిల్వ ఉంచి అక్రమంగా విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎస్సై లక్ష్మణరావు తన సిబ్బందితో దాడి చేసి దుకాణంలో ఉన్న 11 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని శ్రీహరిని అదుపులోకి తీసుకున్నారు. అతనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మద్యాన్ని అక్రమంగా అమ్మినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### నేడు వలంటీర్లకు సన్మానం

**హనుమంతునిపాడు:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వలంటీర్లను సన్మానించనున్నట్లు ఎంపీడీఓ కె.లలిత ఆదివారం ఒక ప్రకటలో తెలిపారు. సన్మాన సభకు ఎంపీపీ గాయం సావిత్రి అధ్యక్షతన జరుగుతుందన్నారు. వలంటీర్లకు ప్రభుత్వం అందజేసిన సేవారత్న, సేవామిత్ర పురస్కారాలు అందజేసి సన్మానిస్తామన్నారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి, మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, సంబంధిత అధికారులు పాల్గొంటారన్నారు.

### పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలి


గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

**టంగుటూరు:** పిల్లలు పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని స్థానిక గ్రంథాలయ నిర్వాహకుడు జి.వర్ధనరాజు సూచించారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించే కార్యక్రమాలు తరచూ నిర్వహిస్తున్నామని, తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రంథాలయానికి పంపాలని కోరారు.

### కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

**బేస్తవారిపేట:** మండలంలోని గొట్టమిండ్ల కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి అర్చనలు, సహస్రనామ, కుంకుమ పూజలు, అఖండహారతి పూజలు చేశారు. పలు గ్రామాల భక్తులు అమ్మవారికిబోనాలుసమర్పించిమొక్కులు తీర్చుకున్నారు.

### టెన్నిస్ టోర్నమెంట్‌లో విజేతల ప్రకటన

**గిద్దలూరు రూరల్:** ఇన్విటేషన్ లాన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో గిద్దలూరుకు చెందిన జిల్లా లాన్ టెన్నిస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ మోహన్‌రెడ్డి సెమీ ఫైనల్‌లో ప్రవేశం సాధించాడు. చిలకలూరిపేటలో 55 వయస్సు విభాగం వారికి నిర్వహించిన టెన్నిస్ టోర్నమెంట్‌లో డాక్టర్లు మోహన్‌రెడ్డి, ఏ.శంకర్‌రెడ్డి, ప్రసన్న, నాగేశ్వరరావు 6, 4 పాయింట్ల తేడాతో విజేతలుగా నిలిచి సెమీ ఫైనల్‌లో ప్రవేశం దక్కించుకున్నారు. ఈ పోటీలకు ఒంగోలు, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి మొత్తం 50 జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా వారికి గిద్దలూరు లాన్ టెన్నిస్ విభాగం అధ్యక్షుడు డాక్టర్ సి.హెచ్.రంగారెడ్డితో పాటుగా పలువురు ప్రశంసించారు.

### అల్లూరి పోలేరమ్మకు పూజలు

**మార్కాపురం టౌన్:** మార్కాపురం పట్టణ శివారులో అల్లూరి పోలేరమ్మ తల్లికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని పుట్ట, నాగశిలలకు భక్తులు పూజలు చేశారు. పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, ఆలయ చైర్మన్, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

# కలిసి ముందుకు సాగుదాం


ఏఎంసీ చైర్మన్ సాల్మన్‌రాజును సన్మానిస్తున్న డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్


సీనియర్ న్యాయవాది సుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్

● వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్

**కనిగిరి రూరల్:** మనమంతా కలిసి పనిచేసుకుందాం.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకుందాం అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. ఏఎంసీ చైర్మన్ చింతంగుంట్ల సాల్మన్ రాజును స్థానిక ఏఎంసీ కార్యాలయంలో.. అలాగే ప్రముఖ సీనియర్ న్యాయవాది, బ్రహ్మణ సంఘ నాయకులు మాచవరం సుబ్రహ్మణ్యంను, ఆర్యవైశ్య ప్రముఖులు ముత్యాల ధర్మ, చెక్కా వరాలతో పాటు మరి కొందరిని ఆదివారం కలిసి వారి మద్దతును కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు సముచిత స్థానం కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదేనన్నారు. సామాజిక సాధికారతకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన నిదర్శమని కొనియాడారు. వెనుకబడిన దళిత, బహుజన బలహీన వర్గాల అభ్యున్నతి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిందని వివరించారు. ప్రభుత్వం చేపట్టిన నవరత్నాల పథకాలతో ప్రతి ఇంట్లో సంక్షేమ కాంతులు విరజిల్లుతున్నాయన్నారు. మనమంతా కలిసి క్షేత్ర స్థాయిలో సంక్షేమ లబ్ధిదారులను కలిసి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన లబ్ధిని ప్రతి ఒక్కరికీ వివరించి ఫ్యాను గుర్తుకు ఓటే వేసే విధంగా చైతన్య వంతులను చేద్దామని పిలుపునిచ్చారు. చిన్న చిన్న సమస్యలను విస్మరించి పార్టీ శ్రేణులంతా సమష్టిగా పనిచేసి.. కనిగిరి కోటపై మరలా వైఎస్సార్ సీపీ జెండా ఎగుర వేద్దాం.. జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, జడ్పీటీసీ కస్తూరిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సూరసాని మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఆర్ మాణిక్యరావు, దేవకి రాజీవ్, ఐ వెంకటేశ్వరెడ్డి, చింతం శ్రీనువాసుల యాదవ్, దాసరి మురళీ, గోబ్బిళ్ల శ్రీను, మార్తాల వెంకటేశ్వరెడ్డి, దేవకి రంగయ్య, పలుకూరి భాస్కర్, కృష్ణారెడ్డి, రఘురామిరెడ్డి, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, పెన్నా ఏడుకొండలు, గోవర్ధన్‌రెడ్డి, బసిరెడ్డి పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శివారు కాలనీ సమస్యలు పరిష్కరిస్తాం


కాలనీల్లో పర్యటిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

**కనిగిరి రూరల్:** దశలవారీగా పట్టణంలోని శివారు కాలనీల్లోని సమస్యలన్నీ పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని మోడల్ స్కూల్ ప్రాంతంలోని శివారు కాలనీల్లో ఆదివారం చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ పర్యటించారు. ఈ సందర్భంగా చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ ప్రభుత్వం అర్హత కల్గిన ప్రతి ఒక్కరికీ ఇంటి నివేశన స్థలంతో పాటు కాలనీ మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. అర్హులంతా ఇళ్ల స్థలాల కోసం సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జగనన్న లే అవుట్‌లో మౌలిక వసతుల కల్పనకు తక్షణ పరిష్కారంగా రోడ్డు సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. శివారు ప్రాంతాల్లో తక్షణ చర్యగా పారిశుధ్య సమస్యను, చిల్ల చెట్ల తొలగింపు కార్యక్రమాలను చేపడతానని వెల్లడించారు. వైస్ చైర్మన్ ఆర్ మాణిక్యరావు, స్థానిక నాయకులు బ్రహ్మయ్య తదితరులున్నారు.

## విశ్వబ్రాహ్మణ సంఘ కార్యవర్గం ఎన్నిక


విశ్వబ్రాహ్మణ సంఘ నూతన కార్యవర్గం

**కందుకూరు రూరల్:** విశ్వబ్రాహ్మణ సంఘం మండల కార్యవర్గ సమావేశం స్థానిక రాళ్లవీధిలో బ్రహ్మంగారి ఆలయంలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా అధ్యక్షుడు ఖాజన వెంకటశేషయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కందుకూరు మండల విశ్వబ్రహ్మణ సంఘం నూతన అధ్యక్షునిగా వడ్లమూడి శేకర్, ఉపాధ్యక్షులుగా మధుర మధు, మాధవరం వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షులుగా కొమెర్ల విజయ్, వెంకటేశ్వర్లు, కృష్ణను ఎన్నుకున్నారు. హరిబాబు, వీరనారాయణ, బ్రహ్మయ్య, పాపయ్య, చిన్న, రమేష్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## విద్యార్థులు భయాందోళనకు గురికావద్దు

● డాక్టర్ దేవరపల్లి కొండలరావు


విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కొండలరావు

**ఉలవపాడు:** విద్యార్థులు పరీక్షల సమయంలో భయాందోళనకు గురికావద్దని నాగార్జున యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్, మోటివేషనల్ స్పీకర్ దేవరపల్లి కొండలరావు అన్నారు. స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ బాలుర హాస్టల్‌లో విద్యార్థులకు ఆయన పలు సలహాలు అందించారు. పరీక్షలు గీటురాయి కాబట్టి చదివే విధానంలో ప్రణాళిక ప్రకారం కష్టపడి చదువుకుంటూ సమయానికి ప్రాముఖ్యత ఇవ్వాలని తెలిపారు. అభ్యంతరపరిచే అంశం అయిన సెల్‌ఫోన్‌ను దూరం పెట్టాలన్నారు. పదేపదే ఉచ్చరణ చేయడం వల్ల సబ్జెక్టు మనసులో స్థిరపడిపోతుందన్నారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసం కలిగి ఉండాలన్నారు. అంబేడ్కర్, అబ్దుల్ కలాంలను ఆదర్శగా తీసుకుని చదవాలని తెలిపారు. యోగా చేయడం ద్వారా మంచి ఏకాగ్రత ఆరోగ్యం వస్తుందని తెలిపారు. విద్యార్థులు మంచి భవిష్యత్ కోసం మంచి మార్గాలనే ఎంచుకోవాలన్నారు. విద్యార్థులు మంచి భవిష్యత్ కలిగి మంచి ఉద్యోగం సాధించాలని తెలిపారు. వార్డెన్ రమణయ్య, ఆశోక్, రమేష్,నరశింహరావు, కేశవరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలేరమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ

**జరుగుమల్లి:** మండలంలోని కామేపల్లిలో పోలేరమ్మ ఆలయంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు శ్రీధర శ్రీనివాస శర్మ అభిషేకాల అనంతరం పోలేరమ్మ మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పొంగళ్లు పెట్టి, జంతు బలులిచ్చి మెక్కులు చెల్లించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఈఓ రావెళ్ల శివశంకర్, ధర్మకర్తల మండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


పొంగళ్లు పెట్టి మెక్కులు చెల్లిస్తున్న భక్తులు

## అన్నప్రసాద వితరణకు విరాళం


అన్నదానికి విరాళం అందజేస్తున్న దాతలు


అనివేటి మండప నిర్మాణానికి విరాళం

**కందుకూరు:** పట్టణంలోని స్కంధపురి జనార్దన స్వామి దేవస్థాన ఆలయంలో నూతనంగా నిర్మించిన రాజగోపురం కలశ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం త్వరలో నిర్వహించనున్నారు. ఈ వేడుకకు హాజరైయ్యే భక్తుల సౌకర్యార్థం పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించనున్నారు. అన్నదానికి సహాయ సహకారాలు అందించేందుకు ఆదిత్యా రెస్టారెంట్ అధినేతలు మద్రిపూడి శ్రీనివాసులు, ప్రసాద్, అలాగే సూర్య రెస్టారెంట్ అధినేత పిడికిటి వెంకటేశ్వర్లు, సామ్రాజ్యం దంపతులు చెరో రూ.25,000 చొప్పున విరాళం అందించారు.

**అనివేటి మండప నిర్మాణానికి విరాళం**

అంకమ్మతల్లి ఆలయం రెండో దశ నిర్మాణంలో భాగంగా చేపట్టిన అనివేటి మండప నిర్మాణానికి దాతలు సహకరిస్తూనే ఉన్నారు. పట్టణానికి చెందిన చీదెళ్ల రాజా రూ.10,116 విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనివేటి మండప నిర్మాణాన్ని రూ. 4కోట్లతో నిర్మించనున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు పిడికిటి వెంకటేశ్వర్లు, కొడాలి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సజావుగా గ్రూప్-2 పరీక్షలు


మలినేని ఇంజినీరింగ్ కాలేజీ వద్ద బందోబస్తులో ఎస్సై టి.శ్రీరామ్

**సింగరాయకొండ(మద్రిపూడి):** సింగరాయకొండలోని కేంద్రాల్లో ఆదివారం ఏపీపీఎస్సీ గ్రూప్-2 ప్రిలిమ్స్ పరీక్ష సజావుగా సాగింది. ఈ పరీక్షలకు 900 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 151 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మలినేని సుశీలమ్మ మహిళా ఇంజినీరింగ్ కాలేజీలో 500 మంది అభ్యర్థులకుగాను 426 మంది, పీఎన్‌సీఏ డిగ్రీ కాలేజీలో 400 మంది అభ్యర్థులకుగాను 323 మంది పరీక్ష రాశారు. పరీక్ష కేంద్రాల వద్ద సీఐ దాచేపల్లి రంగనాథ్ ఆధ్వర్యంలో ఎస్సై టి.శ్రీరామ్, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ తన్నీరు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా శివ పార్వతుల కల్యాణం


లోక కల్యాణం కోసం హోమాన్ని నిర్వహిస్తున్న భక్తులు

**పెద్దదోర్నాల:** మండల కేంద్రంలోని లక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో ఆదివారం శివ పార్వతుల కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అర్చకులు మణిశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కల్యాణ మహోత్సవానికి వీక్షించేందుకు పట్టణానికి చెందిన భక్తులు భారీగా హాజరయ్యారు. శివ పార్వతుల కల్యాణోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో వేకువ జాము నుంచి ప్రణవ పంచాక్షరీ, ఓం నమశ్శివాయ ఏకాహం, సుప్రభాత సేవ, గణపతి పూజ, పుణ్యాహవచనం, మండపార్చన కార్యక్రమాల నడుమ నిర్వహించారు. 101 ప్రమిదలతో కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించారు. కల్యాణంలో పట్టణానికి చెందిన పలువురు దంపతులు పాల్గొన్నారు. కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు మణిశర్మ మాట్లాడుతూ ద్వాదశ జ్యోతిర్లింగాలుగా, అష్టదశ శక్తి పీఠాల్లో ఒక్కటైన శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి వెలిసిన శ్రీశైల పుణ్యక్షేత్రానికి ముఖద్వారంగా ఉన్న పెద్దదోర్నాలలోని లక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో లోక కల్యాణార్థం శివపార్వతుల కల్యాణం, లక్షా దీపోత్సవం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో పలువురు పాల్గొని లోక కళ్యాణం కోసం ప్రత్యేక హోమాన్ని నిర్వహించారు. అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాలతో నగరోత్సవాన్ని నిర్వహించారు.

## ప్రశాంతంగా గ్రూప్-2 ప్రిలిమ్స్ పరీక్ష


పరీక్ష కేంద్రం వద్ద సీఐ వెంకటేశ్వరరావుకు సూచనలిస్తున్న సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా

**మార్కాపురం:** మార్కాపురం పట్టణంలోని 9 కేంద్రాల్లో ఆదివారం గ్రూప్-2 పరీక్ష ప్రశాంతంగా సాగింది. ఆయా కేంద్రాల వద్ద డీఎస్పీ ఎం.బాలసుందరరావు ఆధ్వర్యంలో భారీ స్థాయిలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాలను సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా, పోలీసు అధికారులు పరిశీలించారు. బాలుర ఉన్నత పాఠశాలలో 384 మందికి 264 మంది, బాలికల ఉన్నత పాఠశాలలో 360 మందికి 268 మంది, సాయిబాలాజీ హైస్కూల్లో 280 మందికి 191 మంది, రెడ్డి మహిళా కళాశాలలో 250 మందికి 166 మంది, సాధనా జూనియర్ కళాశాలలో 500 మందికి గానూ 335 మంది, ఏ1 గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలలో 500 మందికిగాను 367 మంది, జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో 500 మందికి 342 మంది, ఇందిరా ఇంజినీరింగ్ కళాశాలలో 504 మందికి 322 మంది, గౌతమి జూనియర్ కళాశాలలో 300 మందికి గానూ 194 మంది హాజరయ్యారు. మొత్తంమీద 3578 మందికిగాను 2,449 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. లైజన్ ఆఫీసర్లుగా ఎంపీడీఓలు శ్రీహరి, కె.శ్రీనివాసరెడ్డి, ఎంవీ శ్రీదేవి, వై.వేణు, ఎ.రాజశేఖర్, బి.శంకర్‌రావు, జె.సుబ్బారెడ్డి, టి.కృష్ణారెడ్డి, సీహెచ్ శ్రీధర్, బాల చెన్నయ్య, రాజబాబు, నాగమణి, ఈశ్వర్, సీహెచ్ శ్రీనివాసులు, ఎస్‌వీ సత్యనారాయణ వ్యవహరించారు. రూట్ ఆఫీసర్లుగా హ్యాండ్ లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ ఏడీ ఉదయ్ భాస్కర్, జిల్లా గిరిజన సంక్షేమాధికారి పి.జగన్నాథరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కె.అర్జున్‌నాయక్ వ్యవహరించారు. సీఐలు ఆవుల వెంకటేశ్వర్లు, రామకోటయ్య, ఎస్సైలు, కానిస్టేబుళ్లు బందోబస్తులో పాల్గొన్నారు.


శరత్‌బాబు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి సురేష్

# పెరికే శరత్‌కు మంత్రి ఘన నివాళి

**టంగుటూరు:** స్థానిక అరుంధతి నగర్‌కి చెందిన పెరికే శరత్‌బాబు ప్రథమ వర్ధంతి ఆదరణ కూడికలో రాష్ట్ర పురపాలక, పటణాభివృద్ధి శాఖ మంత్రి, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొన్నారు. ఆదివారం ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర ఎంబీసీ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, వైఎస్సార్ టీఎఫ్ నాయకులు సూదనగుంట వెంకటస్వామి, బీసీ సెల్ సెక్రటరీ తనీరు వీరనారాయణ, కొండపి ఏఎంసీ డైరెక్టర్ కొమ్ము సురేంద్ర, ఎంపీటీసీ కొమ్ము ప్రభుదాసు, బీసీడీ ఉదయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

**దివ్యాంగుడికి భరోసా**

'ఏమన్నా బాగున్నావా.. పింఛను అందుతోందా, సంక్షేమ పథకాలు వర్తిస్తున్నాయా' అని అరుంధతి నగర్ చెందిన దివ్యాంగుడు సవలం శంకర్‌ను మంత్రి సురేష్ ఆప్యాయంగా పలకరించారు. దివ్యాంగుడి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు.

## సామాజిక స్పృహ నిండిన కావ్యం పాలపిట్ట

**కందుకూరు:** సమాజంలోని సామాజిక, ఆర్థిక, రాజకీయ వంటి అంశాలను ఇతివృత్తంగా తీసుకుని సామాజిక స్పృహతో పాలపిట్ట అనే దీర్ఘకావ్యం రాయడం అభినందనీయమని ప్రముఖ కవి, సాహిత్య విశ్లేషకులు బీరం సుందరరావు అన్నారు. కందుకూరు చెందిన ముప్పవరపు కిశోర్ రాసిన పాలపిట్ట దీర్ఘకావ్యం పుస్తకావిష్కరణ కార్యక్రమం శనివారం రాత్రి స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు, అన్నార్తులు, అనాథలు, అభాగ్యులను కావ్యంలో వస్తువులుగా తీసుకుని వారి జీవితాలను వర్ణించడం గొప్ప విషయమన్నారు. తన స్వీయ అనుభవాన్ని, లోకానుభవాన్ని మేళవించి కవి ఈ కావ్యం రాశారని, హృదయానికి హత్తుకునే ఉందన్నారు. సామాజిక ఇతివృత్తాలుగా దీర్ఘ కావ్యాలు రావాలనేది ప్రముఖ కవి నాగభైరవ కోటేశ్వరరావు కల, అకాంక్ష అని, ఇన్నాళ్లుగా పాలపిట్ట దీర్ఘ కావ్యం ఆ కోవలో రావడం సంతోషించదగ్గ విషయమన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావుమాదిగ మాట్లాడుతూ సమాజ మార్పు కోసం అనేక విప్లవ, బహుజన, సామాజిక ఉద్యమాలతో నిత్యం చైతన్య వంతంగా ఉండే కిశోర్ పాలపిట్ట దీర్ఘకావ్యం ద్వారా సాహిత్యకారుడిగా అవతరించాడని కొనియాడారు. పాలపిట్ట లాంటి అద్భుతమైన కావ్యం రాసిన కిశోర్ అభినందనీయుడని, భవిష్యత్‌లోను మరిన్న పుస్తకాలు రాయాలని ఆకాంక్షించారు. కందుకూరు ప్రాంత గొప్పదనాన్ని, ఇక్కడ జరిగిన విప్లవోద్యమ పోరాటాలను వివరించడం, భవిష్యత్ తరాలకు ఉపయోగపడుతుందని వివరించారు. అనంతరం పాలపిట్ట దీర్ఘ కావ్యం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవి కిశోర్ దంపతులను ఘనంగా సన్మానించారు. నాగార్జున యూనివర్సిటీ సైన్స్ లైబ్రేరియన్ కొండలరావు, దామా వెంకటేశ్వర్లు, పీవీ శేషారావు, గేరా చిరంజీవి, పాశం కొండయ్య, బీవీ రమణ, ఈశ్వరీనాగభూషణం, మాల్యాద్రి, శేషగిరిరావు, ఇనకొల్లు మస్తానయ్య, ఉమ్మడిశెట్టి నాగేశ్వరరావు, పాలేటి సుచరిత, కళ్లగుంట మోహన్‌రావు, కె వెంకటేశ్వర్లు, సంఘా మహేంద్ర, పాలేటి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో గోపూజ, మహానివేదన


మహానివేదనతో ప్రదక్షిణలు చేస్తున్న అర్చకులు, చైర్మన్, ఈఓ, భక్తులు


గోపూజ నిర్వహిస్తున్న అర్చకులు

**సీఎస్‌పురం(పామూరు):** మండలంలోని ప్రఖ్యాత పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం గోపూజ, మహానివేదన అర్చకులు మంకాల సత్యనారాయణ, శివప్రసాదుశర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నారాయణస్వామి మూలవిగ్రహమూర్తికి పంచామృతాభిషేకం, విశిష్ట పూజలు చేశారు. అనంతరం గోవుకు శాస్త్రోక్తంగా అర్చకులు గోపూజ నిర్వహించారు. భజంత్రీల మేళతాళాల నడుమ మహా నైవేద్యంతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం అందజేశారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, ముడుమాల నారాయణరెడ్డి, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలి



సీపీఐ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

**కందుకూరు:** సార్వత్రిక ఎన్నికలకు పార్టీ శ్రేణులంతా సిద్ధంగా ఉండాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్‌బాబు పిలుపునిచ్చారు. స్థానిక కోటారెడ్డిభవన్‌లో ఆదివారం పార్టీ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సీపీఐ శాఖలు ఉన్న ప్రతిచోట శాఖా సమావేశాలు నిర్వహించి రానున్న ఎన్నికలకు శ్రేణులను సిద్ధం చేయాలన్నారు. దేశంలో ఇండియా కూటమి ఆధారంగా రాష్ట్రంలో కూడా సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ పార్టీలు కలిసి పోటీ చేస్తాయన్నారు. ఎన్నికల కోసం ఉమ్మడి పనిచేసి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. సీపీఐ నాయకులు ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు షేక్ హుస్సేన్, వై ఆనందమోహన్, కె. మురళి, నత్తా రామారావు, నీలిశెట్టి నర్సయ్య, యనమల కొండయ్య, బొల్లాజుల బాలబ్రహ్మాచారి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

### నేడు పాతసింగరాయకొండలో పల్లె పల్లెకు సురేష్ అన్న సిద్ధం

**సింగరాయకొండ(మద్రిపూడి):** సింగరాయకొండ మండలం పాతసింగరాయకొండ పంచాయతీలో సోమవారం ఉదయం 8 గంటలకు పల్లె పల్లెకు సురేష్ అన్న సిద్ధం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సామంతుల రవికుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొంటారని పేర్కొన్నారు. పలు అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభిస్తారని తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.